# దురాశ

(చిన్నకథ)

గుండిమెడ వేంకట సుబ్బారావు గారు

సత్యమునకు, ధర్మప్రతిష్ఠకును, దగిన
ఫలితము లొసంగుచును, నాల్గు పాదములను
తిరుగ ధర్మంబు, తొలి వంగ దేశమందు
కలఁడు శృంజయుఁడను ధరాఖండలుండు.

కం. ఆ నరపతి సంతాన వి
హీనుండై బంధుజనులహితమున భక్తా
ధీనుండగు నీశ్వరు వర
దానముఁగొనఁనరిగి ఘోరతప మొనరిచెన్.

చం. బహుళతపోనిరూఢి వన
వాటములన్ వసియించుచున్న యా
మహిపతి భక్తికిన్ కరఁగి
మాన్యగుణాలయుఁడైన యా మహా
మహుఁడు శశాంకశేఖరుఁడు
మానవనాథుని ముందునిల్చి తత్
సహజకృపారసంబు పయిఁ
జల్లుచు రాజును బిల్చి యిట్లనున్.

ఆ. "ఓధరాతలేంద్ర! యుష్మదీయతపః ప్ర
భావమునకు నొదిగివచ్చినాఁడ
నేఁద్రిశూలపాణి నీ యిచ్చవచ్చిన
వర మొసంగువాఁడఁ బల్కు మనఘ!"

మ. అనుచున్ తజ్జననాయకుండు మది బ్ర
హ్మానంద ముప్పొంగ, న
య్యనఘుం గాంచి నమస్కరించి యిటుల
త్త్యాత్రంబుతోఁబల్కు, "నో
కనకాద్రీశ! సువర్ణదేహుఁడయి నా
కన్నంటఁ జల్లార్చు బా
లుని నాకున్ సుతుఁ జేసి నన్ సుఖవిలో
లున్ జేయవే యీశ్వరా!"

ఆ. కలదె యిట్టివింత ఘనగుణాఢ్యుండౌచుఁ
దనకుఁ గీర్తిఁ దెచ్చు తనయుఁ గోర
కకట! స్వర్ణదేహుఁడగు పుత్త్రు నర్థించె!
ప్రభు వదెంత మందభాగ్యుఁడొక్కొ!

కం. అద్ధరణిపు విపరీతపు
బుద్ధికిఁ గారణము లేకపోవునొకో? స్వత
స్సిద్ధంబైన ధనాశన్
బద్ధుండయియుంట నట్టివాంఛ జనించెన్.

గీ. కోరిన వరం బొసంగి పురారి యంత
తని పూజల నంది యదృశ్యుఁడయ్యె
ధరణిపతియు మహానందభరితుఁడగుచు
నరుగు దెంచె నిజాస్థానపురమునకును.

ఉ. అంతటఁ గొన్నిమాసముల
కా నరనాథుని రాణివాసము
ద్ధాంతము నవ్యకాంతులకుఁ
దావలమై విలసిల్ల, నమ్మహీ

కాంతుఁడు కాంచె నిర్మలిన
కాంచనగాత్రుని నొక్కపుత్త్రకున్
కంతునిఁ గేరువాని! శితి
కంఠుని వాక్యము రిత్త వోవునే!

ఆ. ఆకుమారుఁ గాంచి యతులహర్షమహాబ్ధి
నెడలు మరచి యుండెఁ బుడమి ఱేఁడు.
సుతునికంటె వాని యతిలోకసౌవర్ణ
తనువె తనకు మోదధామమయ్యె!

కం. ఈవిధముగ నాశ్రృంజయ [చుం
భూవిభుఁడు కుమారధనవిభూషితుఁ డగు
జీవనయాత్రను బహుసౌ [డై.
ఖ్యావహముగఁ గడపుచుండె నవ్యాకులుఁ

మ పరమానందముతోఁడ నిట్టు లలభూ
పాలుండు నాల్గైదు వ
త్సరముల్ పుచ్చె ననంతరం బొక నిశీ
థంబందు నాభూతలే
శ్వరు సౌధంబునుఁ జొచ్చి రుజ్జ్వలధనా
శన్ ఘోరపాపక్రియా
నిరతుల్ నల్వురు చోరు లీశ్వరుని ని
ర్ణీతంబు సామాన్యమే!

ఆ. గృహముఁ జొచ్చి నాల్గుకెలఁకుల శోధించి
సాధ్యమైనదెల్ల సంగ్రహించి
అచట నచట వెదకి యాచోరవరు లంత
నెడలు పులకరింప నొక్కచోట

కం. కాంచిరి నిద్రారతుఁడై
మంచముపయిఁ బండియున్నమహనీయతనూ
దంచితతేజస్స్వాంతునిఁ [పుత్త్రున్
గాంచనమయగాత్రు, మనుజ కాంతుని

గీ. వానిఁగని స్వర్ణవిగ్రహభ్రాంతులగుచుఁ
జోరులంతట నారాజసుతునిఁబట్టి
లీలఁ గొని పోయి రటఁ బాసి! లేశమేని
యెఱుఁగఁ డీచర్య పాపమాధరణి విభుఁడు!

ఉ. బాలునిఁ గొంచుఁబోయి యొక
పర్వతగహ్వరమందుఁ బెట్టి, యా
కూళలు నాల్గు తున్కలుగఁ
గోసిరి వాని సువర్ణదేహమున్;
కాలవశంబునన్ మనుజ
కాంతుఁడు మక్కువఁ బెంచుకొన్నయా
శాలత లిట్టినిష్ఠురవి
పంపు ఫలంబును గాసె నక్కటా!

ఆ. అనమతప మొనర్చి యార్జించినసుపుత్త్ర
భాగ్యరాశి భస్మపటల మయ్యె!
ఆశఁగొల్పి నట్టి యాత్మీయ వంశంబు
నక్కటకట! మరల దిక్కుమాలె!

ఆ. ఆమహేశ్వరుని జిరాయురారోగ్యవం
తునిఁ గుమారు నొసఁగు, మనక నాఁడు
అకట! స్వర్ణదేహుఁడగు పుత్త్రునేటి క
ర్థించె శ్రృంజయుండు తెలివి మాలి!!

కం. ఈ పర్యవసానం బే
శాపంబో కాని, సర్వసామాన్యముగన్
జూపట్టు నెల్ల యెడలను!
పాపిష్ఠి దురాశ మధురఫలముల నిడునే?